సాక్షి మెదక్

మంగళవారం । 7 । నవంబర్ । 2023



'నోటా' నొక్కేస్తున్నారు

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరరైనా నచ్చకపోతే ఓటర్లు నోటా ద్వారా తమ అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారు.

వివరాలు 10లో ▸



తెల్ల బంగారం తెచ్చిన కష్టం

కొల్చారం మండలంలో సాధారణంగా వరిపైనే రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతారు.

వివరాలు 11లో ▸

రూ.1,43,66,890 స్వాధీనం

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల నేపథ్యంలో జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన జిల్లా గ్రీవెన్స్ కమిటీ రూ.1,43,66,890 నగదును పట్టుకున్నట్లు కలెక్టర్ రాజర్షిషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 9 నుంచి ఈనెల 6వ తేదీ వరకు ఈ నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇందులో నుంచి 47 దరఖాస్తులకు సంబంధించి వ్యక్తులు తగిన ఆధారాలు చూపించడంతో రూ.1,34,98,560 తిరిగి చెల్లించినట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

పనుల్లో నిర్లక్ష్యం వద్దు

డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

పెద్దశంకరంపేట(మెదక్): ఎస్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొవద్దని డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, గ్రామకార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించడంతో పాటు మొక్కలు ఎదిగేందుకు చర్యలు తీసుకోవాలని, నర్సరీలో అవసరమైన మొక్కలను పెంచాలని, ఉపాధిహామీ పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీలు వీరోజ, బాలయ్య, ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా, ఇన్‌చార్జి ఏపీఓ మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఏ గ్రామానికి వెళ్లినా పద్మకు వ్యతిరేకత

కాంగ్రెస్ మెదక్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఏ గ్రామానికి వెళ్లిన తిరుగబడుతున్నారని కాంగ్రెస్ మెదక్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పోచమ్మరాళ్, జక్కన్నపేట, ఫరీద్‌పూర్, ముత్తాయిపల్లి, మక్తభూపతిపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, కిషన్‌గౌడ్, శ్రీనివాస్, నాగరాజు, రమేశ్, శ్రీనివాస్, బ్రహ్మం, పద్మారావు తదితరులు పాల్గొన్నారు మండల పరిధిలోని మద్దుల్‌వాయికి చెందిన 50 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరగా రోహిత్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హరిప్రసాద్ నాయుడు పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ఫాయిల్ విభాగంలో కార్తీక్, రంజిత్, దినేశ్, సాబేర్ విభాగంలో అజయ్, భాస్కర్, సిద్ధూ, ఈపీ విభాగంలో పోచయ్య, వంశీ, అజయ్, సత్యపాల్ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. ఈనెల చివరి వారంలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరంతా పాల్గొంటారని అన్నారు. ఎంపికైన వారిని లెక్చరర్లు, ప్రమీలరాణి, గ్రేసీ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రమోద్ అభినందించారు.

చిచ్చుపెడుతున్న మైనంపల్లి

బీఆర్‌ఎస్ మెదక్ అభ్యర్థి పద్మ

రామాయంపేట(మెదక్): ప్రశాంతంగా ఉన్న మెదక్‌లో మైనంపల్లి హన్మంతరావు చిచ్చు పెడుతున్నారని బీఆర్‌ఎస్ మెదక్ అభ్యర్థి పద్మ ఆరోపించారు. సోమవారం మండలంలోని లక్ష్మాపూర్, కాట్రియాల, దంతేపల్లి, ఝాన్సీ లింగాపూర్, తీన్ నంబర్ తండా, కిషన్ తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా లక్ష్మాపూర్‌లో పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ర్యాలీగా వెళ్తుండగా, దళితవాడలో కొందరు రోడ్డుకు అడ్డంగా వచ్చి ఆమెను అడ్డుకున్నారు. కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు వెంటనే చక్కదిద్దారు. ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డాక్టర్లు లేని ఆస్పత్రులు ఎందుకు?

బీజేపీ మెదక్ అభ్యర్థి పంజా విజయ్ కుమార్

నిజాంపేట(మెదక్): డాక్టర్లు, సౌకర్యాలు లేని ఆస్పత్రులు జిల్లాకు ఎందుకని కొట్లాడి, పని చేయించుకునే దమ్మూ, ధైర్యం ఉన్న ఎమ్మెల్యే కావాలంటే బీజేపీకి ఓటు వేయాలని పార్టీ మెదక్ ఎమ్మెల్యే అభ్యర్థి పంజా విజయ్ కుమార్ అన్నారు. సోమవారం మండలానికి చెందిన రాంపూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయం నుంచి ప్రచారం ప్రారంభించారు. ప్రతీ గ్రామంలో మహిళలు పెద్ద ఎత్తున మంగళహారాతులతో స్వాగతం పలికారు. మండలంలోని రాంపూర్, నస్కల్, నందగోకుల్, చల్మెడ, నగరం, నందిగామ, నిజాంపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం కార్యక్రమంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, తాళ్లపల్లి రాజశేఖర్, నందా రెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్, మధుసూదన్, పార్టీ నాయకులు స్వామిగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాటకు మాట

దూషణల పర్వంగా ప్రచారం

- గెలిస్తే ఏం చేస్తామని చెప్పని అభ్యర్థులు
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ
- అయోమయంలో ప్రజలు



మెదక్: ఎన్నికల నేపథ్యంలో జిల్లాల్లో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రచారంలో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. తమకు ఓట్లు వేసి గెలిపిస్తే ఏం చేస్తాం అని చెప్పడం వదిలేసి వ్యక్తిగత దూషణలు చేసుకుంటున్నారు. బీఆర్‌ఎస్ మెదక్ అభ్యర్థి పద్మా దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ గ్రామాలకు వెళ్లినప్పుడు గతంలో వ్యక్తిగత విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో ఎవరు ఏం మాట్లాడుతున్నారో తెలియక ప్రజల్లో అయోమయ పరిస్థితి నెలకొంది.

రోహిత్ 25 ఏళ్ల పిల్లగాడు..

బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మా దేవేందర్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును టార్గెట్ చేసి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో రెండుసార్లు ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా గెలిపిస్తే చేసిందేమి లేదని ఎద్దేవా చేస్తున్నారు. అప్పుడు ఏమి చేయంది ఇప్పుడు మళ్లీ వచ్చి ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని విమర్శిస్తున్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రజల తాగునీటి ఇబ్బందులు పట్టించుకోలే గానీ, నేడు ఊర్లలో బోర్లు వేయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మెదక్ నియోజకవర్గం తనకు సెట్ కాదని ఇక్కడి నుంచి మల్కాజ్‌గిరి వెళ్లి పదేళ్లపాటు మెదక్ ముఖం చూడని హన్మంతరావు, ఇప్పుడు స్వార్థ ప్రయోజనాల కోసం మళ్లీ మెదక్ లో తిరుగుతున్నారని విమర్శిస్తున్నారు. ఎద్దు, ఎవుసం అంటే తెలియని రోహిత్‌రావు, 25 ఏళ్ల పిల్లగాడు గెలిస్తే ఏమి చేస్తాడు అని ఓటర్లను ఆలోచింపజేస్తున్నారు. రోహిత్‌ను గెలిపిస్తే మెదక్ నియయోజకవర్గం మళ్లీ ఆగమైంతుందంటున్నారు.

పదేళ్లు పద్మాదేవేందర్‌రెడ్డి ఏం చేశారు?

కాంగ్రెస్ అభ్యర్థి మైనపల్లి రోహిత్ రావు ప్రచారంలో మాట్లాడుతూ.. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న పద్మా దేవేందర్‌రెడ్డి మెదక్ ను ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తున్నారు. నియోజక వర్గంలో పెండింగ్ పనులు, నెరవేరని హామీలపై ప్రశ్నలు వేస్తూ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డిలకు సవాల్ విసురుతున్నారు. నియోజకవర్గ రైతాంగానికి ప్రధాన ఆదరువైన ఘనపూర్ ఆనకట్ట ఎత్తు పెంపు విషయంలో పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబడుతున్నారు. ఆనకట్ట ఎత్తు ఎక్కడ పెంచారో 48 గంటల్లో వచ్చి చూయించాలని మంత్రి, ఎమ్మెల్యేలకు రోహిత్‌రావు సవాల్ విసిరారు. అలాగే, మెదక్ మండలంలోని మంబోజిపల్లిలో చారిత్రక నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని 100 రోజుల్లో తెరిపిస్తామని మాటిచ్చిన సీఎం కేసీఆర్ 10 ఏళ్లు గడుస్తున్నా.. ఎందుకు తెరిపించలేదని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని పద్మాదేవేందర్ రెడ్డి పట్టించుకోకపోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఏడుపాయల, చర్చి, పోచారం ప్రాజెక్ట్ ప్రాంతాలను కలిసి టూరిజం సర్క్యూట్ చేస్తామంటూ ఏళ్లుగా మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తుతున్నారు. ఇలా ఎన్నికల ప్రచారంలో ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ప్రజలకు ఏం అభివృద్ధి చేస్తారో చెప్పకుండా మాటకు మాట అన్నట్లుగా దూషించుకోవడం చర్చనీయాంశంగా మారింది.

తల్లిదండ్రులతో ఓటు వేయిస్తాం

విద్యార్థులతో హామీ పత్రాలు రాయించిన కలెక్టర్ రాజర్షిషా



నూతన ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: కొత్త ఓటర్లు తొలి ఓటు అనుభూతి పొందాలని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వీప్ ఆధ్వర్యంలో యువ ఓటర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ తల్లితండ్రులతో తప్పకుండా ఓటు వేయిస్తామని విద్యార్థులతో హామీ పత్రం రాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు తగు సూచనలు సలహాలను అందించారు. ఓటును నిర్లక్ష్యం చేయొద్దని, యువత చైతన్యం కావాలని, రాజకీయ నిర్ణయాధికారం యువతదేనని తెలిపారు. అలాగే ఓటర్లందరికీ 25వ తేదీ వరకు ఓటరు సమాచార స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యంపై కంట్రోల్ రూం ఏర్పాటు

ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ టీమ్‌లు కలిసి పటిష్ఠంగా పని చేయాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. సోమవారం కలెక్టర్ తన చాంబర్‌లో ఎన్నికల అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో మద్యం నిల్వ, పంపిణీ, రవాణాపై కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మద్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం తెలిస్తే 1800 425 2523, 94414 01084. 87126 58903 నంబర్లకు ప్రజలు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్ , సివిల్ సప్లయ్ అధికారి బ్రహ్మారావు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారిణికి కలెక్టర్ అభినందన

మెదక్ కలెక్టరేట్: జాతీయస్థాయి కర్ణాటక ఉమెన్స్ ఫుట్‌బాల్ లీగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన భాగ్యమ్మను కలెక్టర్ రాజర్షిషా అభినందించారు. గత నెల 15 నుంచి ఈనెల 2తేదీ వరకు బెంగుళూరులో నిర్వహించిన జాతీయస్థాయి కర్ణాటక ఉమెన్స్ ఫుట్‌బాల్ లీగ్‌లో రాష్ట్రం నుంచి భాగ్యమ్మ పాల్గొని ప్రతిభ కనబర్చారు. దీంతో జట్టు రెండో స్థానంలో నిలవడంతోపాటు వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి మొదలయ్యే భారత మహిళల ఫుట్‌బాల్ పోటీలకు భాగ్యమ్మ ఎంపికైంది. సోమవారం కలెక్టర్ తన చాంబర్‌లో భాగ్యమ్మను సన్మానించి అభినందించారు. ప్రస్తుతం భాగ్యమ్మ ఫుట్‌బాల్ కోచ్‌గా మెదక్‌లో చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో యువజన, క్రీడల శాఖ జిల్లా అధికారి నాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు



నీలం మధు
పటాన్‌చెరు



సురేష్ షెట్కార్
నారాయణఖేడ్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పటాన్‌చెరు, నారాయణఖేడ్ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థిత్వాలపై నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. పటాన్‌చెరు టిక్కెట్‌ను ఇటీవల ఆ పార్టీలో చేరిన నీలం మధు ముదిరాజ్‌కే ఖరారు చేస్తూ కాంగ్రెస్ అధినాయకత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే నారాయణఖేడ్ అభ్యర్థిత్వాన్ని మాజీఎంపీ సురేష్‌షెట్కార్‌కు ఖరారు చేసింది.

దోపిడీ చేసే పార్టీలకు బుద్ధి చెప్పాలి

విశ్రాంత ఐఏఎస్ మురళీ



మాట్లాడుతున్న ఆకునూరి మురళీ

చేగుంట(తూప్రాన్): అవినీతితో దోపిడీ చేసే పార్టీలను ఓడించాలని విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళీ అన్నారు. ఓటు హక్కు వినియోగంపై నిర్వహిస్తున్న జాగో తెలంగాణ బస్సు యాత్ర సోమవారం చేగుంటకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆకునూరి మురళీ మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల తెలంగాణ పాలనలో అవినీతి దోపిడీలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో సామాన్యులకు అన్యాయం జరిగిందని, రైతులకు పూర్తి స్థాయి రుణమాఫీ జరగలేదన్నారు. తెలంగాణ పేరు చెప్పి ప్రజలను మోసం చేసిన సీఎం కేసీఆర్‌ను ఇంటికి పంపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గోవర్ధన్, బీడీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, పాండు రంగారావు, సంధ్య, సౌజన్య, పుష్ప, గౌస్ పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): మత విద్వేశాలను రెచ్చగొడుతున్న మోదీ సర్కారుతోపాటు అవినీతి, నియంతృత్వ పాలన కొనసాగిస్తున్న సీఎం కేసీఆర్‌ను గద్దె దించాలని విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మరళీ పిలుపునిచ్చారు. సోమవారం రామాయంపేటలో మాట్లాడుతూ.. వేల కోట్ల కుంభకోణాలతో సీఎం తెలంగాణ ప్రజలను వంచించాడని ఆరోపించారు.

కల్లబొల్లి మాటలు నమ్మొద్దు

ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం

నర్సాపూర్ : ఎన్నికలు రావడంతో కొందరు నాయకులు వచ్చి మనం మనం ఒక్కటని, కల్లబొల్లి మాటలు చెబుతారని, అలాంటి మాటలు నమ్మొద్దని ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం కోరారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నర్సాపూర్‌లో కురుమ ఆత్మీయ సమ్మేళనంలో నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ నర్సాపూర్ అభ్యర్థి సునీతారెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, ప్రస్తుత ఎన్నికల్లో ఆమెను గెలిపించేందుకు కుర్మలందరూ కృషి చేయాలన్నారు. అభ్యర్థి సునీతారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కులవృత్తుల వారి సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో అసంఘటిత కార్మిక బోర్డు రాష్ట్ర చైర్మన్ దేవేందర్‌రెడ్డి, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నగేశ్, సారా మల్లేశ్, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య



సంధ్య (ఫైల్)

తూప్రాన్: అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మున్సిపల్ పరిధిలోని బ్రహ్మణపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మణపల్లికి చెందిన శివసాయికి ఆరేళ్ల కిందట మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన సంధ్య(25)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. కొన్ని నెలల కిందట శివసాయికి రోడ్డుప్రమాదం జరగడంతో ఇంటి పట్టునే ఉంటున్నాడు. దీంతో కుటుంబ పోషణ భారమైంది. ఈ క్రమంలోనే సంధ్య అనారోగ్యానికి గురై తీవ్ర మనస్థాపానికి లోనైంది. సోమవారం తన ఇద్దరు కుమారులను పక్కింట్లో వదిలి, ఇంటికెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. 'నా చావుకు ఎవరూ కారణం కాదు.. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో చనిపోతున్నా' అని నోట్ బుక్‌లో రాసి చనిపోయిందని ఎస్‌ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. తల్లి మృతిచెందడంతో ఇద్దరు కుమారులను చూసి ప్రతి ఒక్కరూ కన్నీటిపర్యంతమయ్యారు.

హరీశ్‌రావుకు జైలు ఖాయం

- మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే మంత్రి హరీశ్‌రావును జైలుకు పంపడం ఖాయమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హెచ్చరించారు. సోమవారం పేట మండలం కొర్విపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొర్విపల్లి సర్పంచ్ పద్మమల్లేశం, పాలక వర్గ సభ్యులు, మాజీ జెడ్పీటీసీ సురేందర్‌నాయక్, సూరారం గ్రామ సర్పంచ్ నీరజ పవన్‌గౌడ్ కొర్విపల్లి, టీ.మాందాపూర్ గ్రామాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. మైనంపల్లి మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడిన బీఆర్‌ఎస్ నాయకులు జైలుకు పంపుతామని చెప్పారు. శివ్వంపేట మండలం సికింద్రాపూర్, కొల్లూర్‌లలో హరీశ్‌రావు భూస్కామ్‌కు పాల్పడినట్లు ఆయన ఆరోపించారు. ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీమన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అరుణప్రభాకర్, గంగానరేందర్, రంగారావు, పుల్లారావు, రామ్‌చంద్రం, బందెల సాయిలు పాల్గొన్నారు.

అధిష్టానంపై నమ్మకం ఉంది

పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్

నర్సాపూర్ : కాంగ్రెస్ అధిష్టానం పునరాలోచించి తనను పార్టీ నర్సాపూర్ అభ్యర్థిగా ప్రకటిస్తారన్న నమ్మకం తనకుందని పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ టికెట్ ఇతరులకు కేటాయించినందున, దాన్ని రద్దు చేసి తనకు టికెట్ ఇచ్చే అంశాన్ని పార్టీ అగ్రనేతలు పునరాలోచన చేస్తారన్న నమ్మకం ఉందన్నారు. పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసిన ముగ్గురం ఒక వైపు ఉన్నామని తమలో ఎవరికి టికెట్ వచ్చినా మిగిలిన వారు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నర్సాపూర్‌కు చెందిన ఆవుల రాజిరెడ్డి బీఆర్‌ఎస్‌కు కోవర్టుగా పని చేస్తున్నారని విమర్శించారు. పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ.. పార్టీ కోసం త్యాగాలు చేసి కాపాడిన వారిని కాదని పైరవీకారులకు టికెట్ ఇవ్వడం బాధాకరం అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రిజ్వాన్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, మహేందర్ రెడ్డి, చిన్న అంజిగౌడ్, నర్సింగ్‌రావు, సురేశ్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.100 ఇవ్వలేదని యువకుడి ఆత్మహత్య

- తల్లితో గొడవపడి ఇంటి నుంచి అదృశ్యం
- వారం తర్వాత గ్రామ శివారులో మృతదేహం లభ్యం

వెల్దుర్తి(తూప్రాన్): వంద రూపాయల కోసం తల్లితో గొడవపడి ఇంటినుంచి వెళ్లిన యువకుడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోవడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషాదకర ఘటన వెల్దుర్తి మండలంలోని కుకునూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కుకునూర్ గ్రామానికి చెందిన దుంపల అరుణ్‌కుమార్(22) గత నెల 26న రూ.100 కోసం తల్లితో గొడవపడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. ఆచూకీ కోసం బంధువుల వద్ద వెతికినా దొరకలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు కింద నమోదు చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో సోమవారం చీపురుకొయ్యల కోసం అడవికి వెళ్లిన మహిళలకు గ్రామశివారులోని ఓ చెట్టుకు యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలంలో లభించిన సెల్‌ఫోన్, బట్టల ఆధారంగా మృతుడు కుకునూర్ గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్‌గా గుర్తించారు. వారం రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకోవడంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిందని, కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా

కాంగ్రెస్ అందోల్ అభ్యర్థి దామోదర

అల్లాదుర్గం(మెదక్): సాధారణ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని అందోల్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహా ప్రజలను కోరారు. మండలంలోని మాందాపూర్ గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడిపెద్దాపూర్ గ్రామ బీఆర్‌ఎస్‌కి చెందిన మహమ్మద్ ఖాసీం, మహమ్మద్ జామల్ బాయ్, సాబీర్, యాదుల్, హాజీం, బసీరుద్దీన్, గౌస్, దేవునూరి మూర్తుజ, మహబూబ్ హుస్సేన్ కాంగ్రెస్‌లో చేరారు. వీరికి దామోదర రాజనర్సింహా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, సర్పంచ్ దుర్గారెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు హబ్దుల్ సుకుర్, పార్టీ యువజన జిల్లా ఉపాధ్యక్షుడు అభిలాష్ రెడ్డి, రోషన్ అలీ, సుభాష్ రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేషన్ వేసిన నాటి నుంచి..

- అభ్యర్థుల వ్యయ వివరాలు నమోదు చేయాలి
- ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్



కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సంజయ్‌కుమార్

నర్సాపూర్ : ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయ వివరాలు ప్రతిరోజూ నమోదు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించారు. నామినేషన్ వేసిన నాటి నుంచి అభ్యర్థి ఖర్చులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రతీ అభ్యర్థి బ్యాంకులో కొత్త ఖాతా తెరవాల్సి ఉంటుందని, ఆ ఖాతా నుంచి ఖర్చులు చేయాలని అన్నారు. అభ్యర్థుల ఖర్చులపై నిఘా పెట్టాలని, అక్రమ నగదు, మద్యం పంపిణీ జరుగకుండా చూడాలని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో విధుల వివరాలను రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్‌కు వివరించారు.

ఈకేవైసీ 57.73 శాతం పూర్తి

- జిల్లాలో 2,13,872 రేషన్‌కార్డులు
- ఎన్నికల నేపథ్యంలో నిదానంగా ప్రక్రియ



రేషన్‌షాపులో ఈకేవైసీ చేస్తున్న రేషన్ డీలర్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో బోగస్ రేషన్ లబ్ధిదారులను తీసివేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్(ఈకేవైసీ) ప్రక్రియ నిదానంగా సాగుతుంది. రేషన్‌కార్డులో పేరున్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. దీంతో లబ్ధిదారులు హడావిడిగా రేషన్ షాపునకు వెళ్లి చేయించుకుంటున్నారు. గతంలో డిసెంబర్ ఆఖరు తేదీ అని చెప్పిన అధికారులు, ఎన్నికల నేపథ్యంలో చివరి తేదీ అంటూ ఏమి లేదని చెబుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్‌లో ఈకేవైసీ ప్రక్రియను ప్రారంభించారు. మొత్తం 2,13,872 రేషన్‌కార్డులు ఉండగా, 6,86,498 మంది లబ్ధిదారులు ఉన్నారు. అక్టోబర్ నెలాఖరు వరకు 3,96,311 మంది ఈకేవైసీ చేసుకోగా, మరో 2,90,187 మంది లబ్ధిదారులు చేయించుకోవాల్సి ఉంది. ప్రతీ ఒక్కరూ రేషన్‌షాపునకు వెళ్లి వేలి ముద్ర వేస్తేనే ఈకేవైసీ పూర్తి అవుతుంది. రేషన్ కార్డుల్లో చాలా ఏళ్లుగా చనిపోయిన వారు, వివాహం చేసుకొని వెళ్లిపోయిన వారు అలానే ఉన్నారు. అయితే వారి పేర్లు కార్డులో నుంచి తొలగించలేదు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని కార్డులోని ప్రతీ లబ్ధిదారుడు ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం నిబంధనలు జారీ చేసింది. ఎన్నికల ముందు సాఫీగా సాగిన ప్రక్రియ నేడు ఆలస్యంగా నడుస్తుంది.అలాగే, ఉపాధి నిమిత్తం బయటి దేశాలకు వెళ్లినవారు తమ ఈకేవైసీని ఎలా చేసుకోవాలంటూ ఆందోళన చెందుతున్నారు. తమ పేర్లు రేషన్ కార్డుల్లో తొలగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి



రేషన్ లబ్ధిదారుల పారదర్శకత కోసం ప్రభుత్వం ఈకేవైసీ ప్రవేశ పెట్టింది. కార్డులో పేరున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రేషన్ షాపు వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలి. ఇందుకోసం నిర్ణీత గడువంటూ ఏమీ లేదు. జిల్లాలో ఇప్పటి వరకు 57.73శాతం పూర్తి అయ్యింది. మిగతా వారు సైతం విధిగా చేయించుకోవాలి.

–బ్రహ్మారావు, జిల్లా పౌరసరఫరాల అధికారి

క్షణాల్లో.. ఓటరు ఐడీ కార్డ్‌

చిన్నకోడూరు(సిద్దిపేట): కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఓటరు ఐడీ కార్డు రావడం ఆలస్యం అవుతుంది. కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా కల్పించిన వెసులు బాటుతో ఇంట్లో నుంచే ఓటరు ఐడీ కార్డును క్షణాల్లో డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చు. అదేలాగో ఇప్పుడు చూద్దాం..

ఆన్‌లైన్‌లో పొందండిలా..

ముందుగా ఎన్‌వీఎస్‌పీ పోర్టల్‌లో voterrecgov.in లో లాగిన్‌ అవ్వాలి. తర్వాత హోమ్‌పేజీలో ఉన్న ఈ–ఎపిక్‌ డౌన్‌లోడ్‌ ఆప్షన్‌ ఎంచుకోవాలి. అనంతరం స్క్రీన్‌పై అడిగిన విధంగా మీ మొబైల్‌ నంబర్‌ లేదా ఈ మెయిల్‌ ఐడీ లేదా ఎపిక్‌ నంబర్‌ను ఎంటర్‌చేసి సబ్‌మిట్‌ బటన్‌ నొక్కాలి. తరువాత రిక్వెస్టు ఓటీపీపై క్లిక్‌చేస్తే మీ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దానిని నిర్దేశించిన బాక్స్‌లో నమోదు చేయాలి. చివరగా డిజిటల్‌ ఓటర్‌ ఐడీ కార్డును డౌన్‌లోడ్‌ చేసుకునేందుకు ఈ–ఎపిక్‌ అనే ఆప్షన్‌పై క్లిక్‌ చేయాలి. ఓటరు ఐడీ పీడీఎఫ్‌ ఫార్మాట్‌లో డౌన్‌లోడ్‌ అవుతుంది. ఫిజికల్‌ కార్డు కావాలనుకునే వారు దగ్గర్లోని మీ సేవా లేదా ఇంటర్‌నెట్‌కు వెళ్లి ఓటర్‌ ఐడీ కార్డును ప్రింట్‌ తీసుకోవచ్చు.



తప్పిన తిప్పలు

ఈ ప్రక్రియతో ఎన్నికల సంఘం పంపే ఓటరు గుర్తింపు కార్డు కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు. ఈ సౌలభ్యం గతంలోనూ ఉన్నప్పటికీ అది ఆమోదం పొందేందుకు చాలా సమయం పట్టేది. నమోదిత వివరాలు సంబంధిత అసెంబ్లీ ఎన్నికల అధికారి ఆమోదించిన తరువాతే ఆ ప్రక్రియ పూర్తయ్యేది.

నచ్చలేదా.. నోటా నొక్కేస్తున్నారు

- మెదక్‌ జిల్లాలో అభ్యర్థులపై పెరుగుతున్న వ్యతిరేకత
- గత ఎన్నికల్లో 2263 ఓట్లు పోల్‌

మెదక్‌ కలెక్టరేట్‌: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నచ్చకపోయినా గతంలో ఓటర్లు ఎవరికో ఒకరికి ఓటు వేసేవారు. కొంత కాలంగా అభ్యర్థులపై తమ అయిష్టతను తెలియజేసేందుకు ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ మిషన్‌లో ''నోటా'' ఆప్షన్‌ను జత చేసింది. దీంతో ఓటర్లు నోటా ద్వారా తమ అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 12 మంది అభ్యర్థులు బరిలో నిలబడ్డారు. బీఆర్‌ఎస్‌ నుంచి పద్మాదేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్‌ నుంచి ఉపేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి ఆకుల రాజయ్య, బీఎస్పీ నుంచి దూడ యాదేశ్వర్‌, జనతా పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, ఇతర పార్టీలు, స్వతంత్రులు బరిలో నిలిచారు. వారిలో పద్మాదేవేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందగా, ఉపేందర్‌రెడ్డి రెండో స్థానంలో నిలిచారు. కాగా బీజేపీ అభ్యర్థి ఆకుల రాజయ్య డిపాజిట్‌ కోల్పోయారు. ఇక మిగతా వారి సంగతి అంతంత మాత్రమే. ఈ ఎన్నికల్లో 899 పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్లతో కలిపి మొత్తం 1,68,911 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో 2263 మంది నోటాకు ఓటేసి అభ్యర్థులపై తమ నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో వివిధ శాఖల ద్వారా అత్యవసర సేవలు అందించే అధికారులకు కేటాయించే 899 పోస్టల్‌ బ్యాలెట్‌లలో 49 ఓట్లు చెల్లకుండా పోగా, 3 ఓట్లు నోటాకు పడడం గమనార్హం. ఇప్పటికీ ''నోటా'' అనే మీట ఉందనే విషయం చాలా మంది ఓటర్లకు తెలియదు. అందువల్లే నోటాకు ఓట్లు తక్కువగా పడుతున్నాయని విద్యావంతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటును నోటాకు కాకుండా సరైన నాయకుడికి వేసి అభివృద్ధికి దోహద పడాలని మేధావులు సూచిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో నోటాను మీటే ఓట్లు ఎన్నో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



జంగ్ తెలంగాణ

క్లుప్తంగా

కాంగ్రెసోళ్లను నమ్మి మోసపోవద్దు

అక్కన్నపేట(హుస్నాబాద్‌): కాంగ్రెస్‌ నాయకులకు ఒక్కసారి కాదు.. 11సార్లు 55 ఏళ్ల చాన్స్‌ ఇచ్చినా ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయారని ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ అన్నారు. సోమవారం మండలంలోని మల్లంపల్లి, పెద్ద తండా, జనగామ, అంతక్కపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడారు.. కాంగ్రెస్‌ హయాంలో తండాల్లో గుక్కెడు తాగునీళ్లు కూడా దొరకలేదని, బిందెలు పట్టుకొని పొలాలకు పరుగులు పెట్టారని గుర్తు చేశారు. గిరిజనులంతా బీఆర్‌ఎస్‌ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్‌కు ఓటేసి గెలిపించాలని అన్నారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో తిరుపతినాయక్‌, రాంచందర్‌నాయక్‌, రాజునాయక్‌, సత్యంనాయక్‌, వీరన్న నాయక్‌, శ్రీనివాస్‌నాయక్‌, మోహన్‌నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రసమయి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలో సోమవారం రాత్రి బీఆర్‌ఎస్‌ నిర్వహించిన ప్రచార సభలో స్థానిక ఎంపీటీసీ భర్త మధుసూదన్‌రెడ్డిపై ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్‌ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. మధుసూదన్‌రెడ్డి ఇటీవల బీఆర్‌ఎస్‌ నుంచి కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. అతను పార్టీ మారి ఓట్లు ఎలా అడుగుతాడని మాట్లాడటంతో గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది.

-నారాయణఖేడ్‌

ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలయ్యేలా ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. నాయకులు ఓటర్లను ప్రభావితం చేయాలని చూస్తే కఠినంగా వ్యవహరించనుంది. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగులు సైతం ప్రచారాలకు దూరంగా ఉండాలి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో పాల్గొనడం నియమావళి ఉల్లంఘన కిందికి వస్తుంది. జిల్లాలో ఉద్యోగుల ప్రవర్తన తీరు గురించి అక్కడక్కడ వస్తున్న ఫిర్యాదులపై ఎన్నికల అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు.

గీత దాటితే.. వేటే!

- ప్రభుత్వ ఉద్యోగులూ తస్మాత్‌ జాగ్రత్త
- చాటుమాటు ప్రచారం చేసినా వేటు తప్పదు
- ప్రత్యేక నిఘా పెట్టిన ఎన్నికల సంఘం



గత అనుభవాల దృష్ట్యా..

గతంలో జరిగిన ఎన్నికల్లో కొందరు ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిబంధనల ఉల్లంఘనకు పాల్పడడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, సాటి ఉద్యోగుల పోస్టల్‌ బ్యాలెట్లు ఒక పార్టీకి వేసేలా ఒత్తిడి తెచ్చిన ఘటనలు జరిగాయి. కాగా ఈ సారి కోడ్‌ ఉల్లంఘనపై సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక బృందాలను ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. గతంలో రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద ఉద్యోగులు తిరగాడడం, కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నట్లు ఆరోపణలు వచ్చాయి. కాగా ఈ మారు అలా జరగకుండా ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

పటిష్ట నిఘా..

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు చేయడంలో భాగంగా ప్రతీ నియోజకవర్గంలో ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. వీడియో సర్వేలెన్స్‌, స్టాటిస్టికల్‌ సర్వేలెన్స్‌ బృందాలను ఏర్పాటు చేసింది. రాజకీయ పార్టీల ప్రచార సమయంలో వీడియో రికార్డింగ్‌ పకడ్బందీగా చేయిస్తోంది. ఇలా చేసిన రికార్డింగ్‌ను పరిశీలన బృందం అధికారులు ఎప్పటికప్పుడు వీక్షిస్తుంటారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ప్రచారంలో పాల్గొన్నట్లు గమనిస్తే ఎన్నికల సంఘానికి నివేదిస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంబంధిత అధికారులపై వేటు వేయడం లేదా శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటారు. అదే విధంగా సోషల్‌ మీడియాను సైతం మీడియా మానిటరింగ్‌ బృందం అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు. పార్టీలకు అనుకూలంగా, ప్రతికూలంగా పోస్టులు పెట్టినా ఎన్నికల సంఘం చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుంది.

ఇవీ నిబంధనలు..

ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనకూడదు. తన కిందిస్థాయి ఉద్యోగులను, ఇతరులను ఫలానా పార్టీకి ఓటు వేయాలని ఒత్తిడి చేయకూడదు. ఓటర్లు ప్రలోభాలకు గురయ్యేలా ప్రకటనలు ఇవ్వకూడదు. రాజకీయ పార్టీల కండువాలు వేసుకుని ప్రచారం నిర్వహించకూడదు. సోషల్‌మీడియాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టకూడదు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వివిధ కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఎన్నికల కోడ్‌ పరిధిలోకి వస్తారు.

ఓ అధికారిపై చర్య

ఇటీవల జిల్లాలోని ఓ మండల స్థాయి అధికారి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించాడన్న ఫిర్యాదుపై జిల్లా ఎన్నికల అధికారి తక్షణం స్పందించి విచారణ చేశారు. సదరు అధికారి సంజాయిషీ తీసుకున్నారు. దానికి సంతృప్తి చెందని అధికారులు అతన్ని విధుల నుంచి సస్పెండ్‌ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

మీకు ఈ సంగతి తెలుసా?



పాపన్నపేట(మెదక్‌): పోలింగ్‌ బూత్‌లో టెండర్‌ ఓటు, చాలెంజ్‌ ఓట్ల గురించి మాట్లాడుకుంటుంటే వింటుంటాం. అసలు వీటి గురించి చాలామందికి తెలియదు. ఇప్పుడు వాటి వివరాలు తెలుసుకుందాం. తమ ఓటు గల్లంతయ్యిదని ఫిర్యాదు చేసే వ్యక్తుల కోసం ఎన్నికల సంఘం 'టెండర్‌ ఓటు' ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఓటరు ఓటు వేయవచ్చు. ఎన్నికల సంఘం నిబంధనలలోని సెక్షన్‌ 42 ప్రకారం 'టెండర్‌ ఓటు' ఏర్పాటు చేశారు. మీరు ఓటు వేయడానికి పోలింగ్‌ స్టేషన్‌కు వెళ్లినప్పుడు.. అప్పటికే మీ ఓటు ఎవరైనా వేస్తే ప్రిసైడింగ్‌ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. అధికారి పరిశీలించి మీ గుర్తింపును ధ్రువీకరిస్తారు. దీని తర్వాత మీరు టెండర్‌ ఓటును డిమాండ్‌ చేయవచ్చు. ఇటువంటి పరిస్థితిలో ఈవీఎం ద్వారా ఓటు వేయలేరు. బ్యాలెట్‌ సాయంతోనే ఓటు వేసేందుకు అవకాశం ఉంటుంది.

చాలెంజ్‌ ఓటు..

ఓటింగ్‌ జరుగుతున్నప్పుడు పోలింగ్‌ స్టేషన్‌లో చాలెంజ్‌ ఓటుకు అవకాశం ఉంటుంది. దీని ద్వారా అక్రమ ఓటర్లను అడ్డుకోవచ్చు. ఎన్నికల ఏజెంట్లు ఈ చాలెంజ్‌ ఓటును ఉపయోగించుకుంటారు. దీని కోసం రూ.2 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఎవరైనా ఓటరు ఓటు వేయడానికి పోలింగ్‌ స్టేషన్‌కు వచ్చినప్పుడు, అతను నకిలీ ఓటర్‌ అని ఏజెంట్‌ అనుమానించినప్పుడు చాలెంజ్‌ ఓటు ఉపయోగపడుతుంది. పోలింగ్‌ ఏజెంట్‌ ప్రిసైడింగ్‌ అధికారి ఎదుట చాలెంజ్‌ ఓటు వేస్తాడు. రూ.2 రుసుం కూడా చెల్లిస్తాడు. అప్పుడు ఎలక్టోరల్‌ ఆఫీసర్‌ ప్రిసైడింగ్‌ అధికారికి అతను సరైన ఓటరు కాదని తెలియజేస్తాడు. దీంతో ప్రిసైడింగ్‌ అధికారి ఓటరు దగ్గరున్న పత్రాలను తనిఖీ చేసి, అవి సరిగా ఉంటే ఓటరుకు ఓటు హక్కు కల్పిస్తారు. ఎన్నికల ఏజెంట్‌ చెప్పినది నిజమని స్పష్టమైతే ఓటరును ఓటు వేయకుండా అడ్డుకుంటారు.



దొరల రాజ్యాన్ని తరిమికొడదాం

దుబ్బాక: దొరల, రెడ్డిల పాలనతో దుబ్బాక అభివృద్ధికి నోచుకోలేదని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మసమాజ్‌ పార్టీ అభ్యర్థి వెంకట ప్రసన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ విశారదన్‌ మహారాజ్‌ కోరారు. సోమవారం ఆయన పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్రంలో అణగారిన కులాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా తమ పార్టీ ఎన్నికల్లో ముందుకు సాగుతుందన్నారు. అవినీతి ప్రభుత్వాలకు చరమగీతం పాడాలన్నారు.

ఉద్యమంలో పోరాడిన చరిత్రే.. నా ఆస్తి

కాంగ్రెస్‌ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌

హుస్నాబాద్‌: కాంగ్రెస్‌ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌ సోమవారం నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలంలో ఎన్నికల ప్రచారం ముగించుకొని సైదాపూర్‌ మండలానికి వెళ్తున్న క్రమంలో హుజూరాబాద్‌ శివారులో ఆయన వాహనాన్ని ఎన్నికల కోడ్‌ అధికారులు తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న సూట్‌ కేసును చూసిన పోలీస్‌లు అందులో ఏమి ఉన్నాయని ప్రశ్నించగా, ఇది నా ఆస్తి.. చూపించమంటారా అని పొన్నం దానిని తెరిచి చూపించారు. అందులో ఆయనకు సంబంధించిన తెలంగాణ చరిత్ర, పార్లమెంట్‌లో పెప్పర్‌ స్ప్రే దాడికి గురైనప్పటి దృశ్యాలు, ప్రధాని మన్మోహన్‌ సింగ్‌, పలువురి ఎంపీలు, సోనియాగాంధీతో సమావేశమైన చిత్రాలు కనిపించాయి.

బీఆర్‌ఎస్‌ పాలనలో అభివృద్ధి శూన్యం

కాంగ్రెస్‌ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిన నాయకులు ఓట్ల కోసం గ్రామాల్లోకి వస్తే నిలదీయాలని కాంగ్రెస్‌ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మల్లుపల్లి, లింగుపల్లి, అల్వాలలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గ ప్రజల ఆత్మ గౌరవాన్ని సిద్దిపేట నాయకులకు తాకట్టు పెట్టేవారు కావాలా.. అభివృద్ధి చేసేవారు కావాలో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీఆర్‌ఎస్‌ తొమ్మిదేళ్ల పాలనలో దుబ్బాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయిందన్నారు. బీఆర్‌ఎస్‌, బీజేపీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఎంపీపై జరిగిన కత్తి దాడితో కాంగ్రెస్‌ పార్టీకి ఎలాంటి సంబంధం లేకున్నప్పటికీ బురద జల్లే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజల్లో మంచి స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దెల రాజేష్‌, రత్నారెడ్డి, మహేష్‌, జహంగీర్‌, భాస్కర్‌, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ రుణం తీర్చుకుందాం

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్‌ ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్‌): కుకునూరుపల్లిని మండలంగా మార్చిన సీఎం కేసీఆర్‌ రుణం తీర్చుకునే సమయం వచ్చిందని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కుకునూరుపల్లి మండలం రాంచంద్రాపూర్‌, తిప్పారం, కుకునూరుపల్లి, మాత్‌పల్లి, కోనాయిపల్లి, మేదినీపూర్‌ విశ్వనాతపల్లి, రవీంద్రనగర్‌, వెలికట్ట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్‌ షో, బైక్‌ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార దాహం కోసం కాంగ్రెస్‌, బీజేపీలు గ్రామాల్లో కొత్త బిచ్చగాళ్ల మాదిరిగా తిరుగుతున్నారన్నారు. మండలం మరింత అభివృద్ధి చెందాలంటే కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో దేవి రవీందర్‌, కోల సద్గుణ, పిస్క అమరేందర్‌, మడుపు భూంరెడ్డి, కాచం నవీన్‌ కుమార్‌, పొల్కంపల్లి నరేందర్‌, మల్లం ఐలయ్య, శ్రీనివాస్‌, కిరణ్‌కుమార్‌చారి, మహిపాల్‌, రుషీ, కనకయ్య, సంపత్‌ పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్‌ పార్టీకి పెరిగిన ఆదరణ

హత్నూర(సంగారెడ్డి): గ్రామాల్లో కాంగ్రెస్‌కు ప్రజాదరణ పెరిగిందని ఆ పార్టీ నర్సాపూర్‌ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రొయ్యపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ నాయకులు కొందరు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో హస్తం పార్టీ విజయం ఖాయమన్నారు. నీరుడి పోచయ్య, జిల్లా వెంకటేష్‌, నీరుడి సత్యనారాయణ, పటేల్‌ దాసు, వీరేశం, రాములు, సామయ్య, సాయిలు, అంతరం భిక్షపతి, భిక్షపతి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంఏ. హకీమ్‌, కొన్యాల వెంకటేశం, రియాజ్‌ అలీ, మన్నె నర్సింలు, ప్రశాంత్‌ గౌడ్‌, కత్తుల సత్యనారాయణ, ఈసు బాబా, హరి శంకర్‌ గౌడ్‌, గౌడి శ్రీనివాస్‌, అరవింద్‌, ప్రసాద్‌ యాదవ్‌, భాను, అజయ్‌, యశ్వంత్‌ తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే.. దుబ్బాక సమస్యలన్నీ పరిష్కరిస్తా

బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్‌): గెలిచిన రెండేళ్లుగా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశానని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. సోమవారం మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి, పోతాన్‌పల్లి, పోతాన్‌శెట్టిపల్లి, నడిమి తండాలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో ఉండే నాయకుడికే సమస్యల గురించి తెలుస్తుందని చెప్పారు. అందరి సమస్యలు తెలిసిన తనను గెలిపిస్తే పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం చందాయిపేట దుర్గమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యేను తులాభారం వేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌, భూపాల్‌, నాగేందర్‌రెడ్డి, హరిప్రసాద్‌, అంజాగౌడ్‌, జగన్‌గౌడ్‌, నాగభూషణం, గణేష్‌, రఘువీర్‌, కర్ణ పాండు, జ్యోతి,లావణ్య, రమ్య పాల్గొన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని మాధవనేని రఘునందన్‌రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండాపూర్‌, అందె గ్రామాల్లో ఆయన ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల రోశయ్య, మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజు, కొండాపూర్‌ ఉప సర్పంచ్‌ జీగిరి అమర్‌, నాయకులు భిక్షపతి, నిఖిల్‌, భాను, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్‌ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు'

హుస్నాబాద్‌: కేసీఆర్‌ లేకుంటే తెలంగాణ గురించి మాట్లాడేవారే లేరని, కోదండరాంకు ఏమి తెలుసని ఇక్కడికి వచ్చి విమర్శిస్తున్నారని హన్మకొండ జెడ్పీ చైర్మన్‌ సుధీర్‌ కుమార్‌ మండిపడ్డారు. సోమవారం హుస్నాబాద్‌ బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కోసం 360 మంది విద్యార్థులను బలి తీసుకుంది కాంగ్రెస్సేనని అన్నారు. పొన్నం ప్రభాకర్‌ కరీంనగర్‌లో మూడు సార్లు ఓడిపోయి, మళ్లీ హుస్నాబాద్‌కు వచ్చాడని.. ఇక్కడ కూడా ఓడిపోవడం ఖాయమన్నారు. సమావేశంలో ఎడబోయిన తిరుపతి రెడ్డి, దండుగుల రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని.. ఇంట్లో నుంచి వెళ్లి..

కాలువలో శవమై తేలిన బాలుడు

గజ్వేల్‌రూరల్‌: తల్లి మందలించిందని ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఓ బాలుడు మరునాడు కాలువలో శవమై తేలిన ఘటన మండల పరిధిలోని దాతర్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాయిని యాదగిరి–వాణి దంపతులకు ఓ కొడుకు, కూతురు ఉన్నారు. వీరి పెద్దకొడుకు చరణ్‌(11) రిమ్మనగూడలోని పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం తల్లిని డబ్బులు అడగడంతో చరణ్‌ను మందలించింది. దీంతో అతను ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రి అయినా ఇంటికి రాలేదు. మరుసటి రోజు గ్రామ సమీపంలోని కాళేశ్వరం ప్రాజెక్టు కాలువలో చరణ్‌ మృతదేహం గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాలువ వద్దకు వెళ్లిన పిల్లవాడు ప్రమాదవశాత్తు అందులోపడి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫ్రాడ్‌ కేసులో జరిమానా

జిన్నారం(పటాన్‌చెరు): ఉద్యోగుల పీఎఫ్‌ డబ్బును సొంత అవసరాలకు ఉపయోగించుకున్న కేసులో ఒకరికి సోమవారం కోర్టు జరిమానా విధించింది. సీఐ నయీముద్దీన్‌ తెలిపిన వివరాలు. బొల్లారంలోని టర్బో మిషనరీ ఇంజనీరింగ్‌ ఇండస్ట్రీస్‌ లిమిటెడ్‌ పరిశ్రమలో తోట సుబ్బారాయుడు డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 2014లో ఉద్యోగుల పీఎఫ్‌ నగదు రూ.2,10,722 ను ఆయన వాడుకున్నాడు. అప్పటి ఎస్‌ఐ ప్రశాంత్‌కు ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. దీనిపై సంగారెడ్డి ప్రథమ శ్రేణి, ప్రత్యేక మొబైల్‌ కోర్టు జడ్జి అనిత సుబ్బారాయుడికి రూ.3వేల జరిమానా విధించారు.

మా రూటే సపరేటు..

దుబ్బాకలో బీఆర్‌ఎస్‌ నాయకులు వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం పట్టణంలోని 14, 17 వార్డులలో ఆ పార్టీ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫొటో మాస్క్‌లు ధరించి ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో భూంరెడ్డి, బాలకిషన్‌ గౌడ్‌, వంశీకృష్ణ గౌడ్‌, ఖలీల్‌, తదితరులున్నారు.

- దుబ్బాక



ప్రభాకర్‌రెడ్డి మాస్కులతో నాయకులు